# రూ.కోటి 23 లక్షలు పట్టివేత

- హవాలా రాకెట్ గుట్టు రట్టు
- రాంకోఠిలో రూ.18 లక్షలు సీజ్
- మేడ్చల్‌లో రూ.54 లక్షల పైచిలుకు నగదు, 18 తులాల బంగారం
- నారాయణగూడలో రూ.49 లక్షలు

సిటీబ్యూరో, అక్టోబర్ 14(నమస్తే తెలంగాణ): ఎన్నికల షెడ్యూల్ విడుదలైన సందర్భంగా నగరంలో పోలీసు అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో పోలీసులు వాహనాల తనిఖీలను తీవ్రతరం చేశారు. పలుచోట్ల లెక్కకు రాని లక్షలాది రూపాయలు పట్టుపడుతున్నాయి. కాగా, శనివారం ఒక్కరోజే దాదాపు రూ. కోటి 23 లక్షలకు పైగా పోలీసులు పట్టుకున్నారు. అంతే కాకుండా 18 తులాల బంగారు ఆభరణాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. కాగా, అందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.



మేడ్చల్‌లో స్వాధీనం చేసుకున్న నగదు, నగలను ప్రదర్శిస్తున్న సీఐ నర్సింహారెడ్డి, ఎస్సై, సిబ్బంది

### హవాలా ద్వారా అక్రమంగా...

హవాలా ద్వారా అక్రమంగా డబ్బులు తరలిస్తున్న ఒక వ్యక్తిని సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.18 లక్షలు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం, రాజస్థాన్ ప్రాంతానికి చెందిన సవాయి శర్మ(42) ఉపాధి కోసం కొన్ని వారాల క్రితం నగరానికి వచ్చి, రామ్‌కోఠిలో నివాసముంటున్నాడు. వృత్తి రీత్యా ట్రాన్స్‌పోర్ట్ నిర్వహించే శర్మ సులభంగా డబ్బులు సంపాదించాలనే దురాశతో హవాలా ఏజెంట్‌గా మారాడు. ఈ క్రమంలోనే కేరళకు చెందిన మనీష్‌తో పరిచయం ఏర్పర్చుకుని అతడికి 0.5 నుంచి 0.8 శాతం కమీషన్‌తో డబ్బులు హవాలా మార్గంలో పంపిణీ చేస్తున్నాడు. ఇందులో భాగంగా మనీష్ సూచనల మేరకు బేగంబజార్, ఇతర మార్కెట్‌లలోని వ్యాపారులతో రూ.18 లక్షల వరకు కలెక్ట్ చేసిన శర్మ, శనివారం ఆ డబ్బును హవాలా ట్రాన్జాక్షన్ చేసేందుకు తన యాక్టివా వాహనంపై బేగంబజార్ పరిధిలోని సాయి ప్లైవుడ్ దగ్గరకు వచ్చాడు. అంతలోపు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు డబ్బుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు, సరైన పత్రాలు లేకపోవడంతో నిందితుడిని అరెస్టు చేసి, అతడి వద్దనున్న డబ్బును సీజ్ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును బేగంబజార్ పోలీసులకు అప్పగించారు.

### మేడ్చల్‌లో భారీగా నగదు పట్టివేత

మేడ్చల్: మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు, సిబ్బంది ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. నాలుగు రోజుల్లో వ్యవధిలో రూ.54 లక్షలకు పై చిలుకు నగదు, 18 తులాల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ నర్సింహారెడ్డి తెలిపిన ప్రకారం, ఈ నెల 7వ తేదీన కిష్టాపూర్ క్రాస్‌లో వాహన తనిఖీలు చేపట్టగా కారులో వెళ్తున్న ఏపీలోని వైఎస్‌ఆర్ జిల్లాకు ఎర్రగుట్ల మండలం చీలంకూర్‌కు చెందిన ఆదిరెడ్డి నర్సింహారెడ్డి వద్దనున్న బ్యాగులో రూ.13 లక్షల నగదు, వీవో ఫోన్ లభ్యమైంది. 11వ తేదీన మేడ్చల్ పట్టణంలోని వివేకానంద విగ్రహ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా మెదక్ జిల్లా మెదక్ పట్టణంలో ఫతేనగర్‌కు చెందిన నాగేందర్ వద్ద రూ.35 లక్షలు నగదు లెక్క చూపని నగదు దొరికింది. 12వ తేదీన బైక్‌పై వెళ్తున్న ఒక వ్యక్తి వద్ద రూ.60 వేలు నగదు, 13వ తేదీన డబిల్‌పూర్ క్రాస్ రోడ్డు వద్ద మరో వ్యక్తి వద్ద నుంచి రూ.62,900లు, అదే రోజున మేడ్చల్ పట్టణంలో మార్కెట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఒక వ్యక్తి వద్ద నుంచి ర.5.68 లక్షలు, 18 తులాల బంగారం లభించింది. మొత్తంగా రూ.54,90,900 నగదు లభించింది. ఈ డబ్బులను సీజ్ చేసి, ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ ముందు ప్రవేశపెడుతామని సీఐ తెలిపారు.

### నారాయణగూడలో రూ.49 లక్షలు పట్టివేత

హిమాయత్‌నగర్: ఎన్నికల నేపథ్యంలో నారాయణ గూడ పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. మైలార్ దేవరపల్లిలోని ఓ కంపెనీ లో మెహిదీపట్నానికి చెందిన మహ్మద్ అతీక్ అహ్మద్, బంజారాహిల్స్‌కు చెందిన కాజిల్ మాలిక్‌లు కార్మికులుగా పనిచేస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో కంపెనీకి సంబంధించిన డబ్బులను వసూలు చేసుకుని యాజమాన్యానికి ఇచ్చేందుకు హోండా యాక్టివాపై వెళ్లుతున్నారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఇండియన్ బ్యాంక్ సమీపంలో నారాయణగూడ పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా రూ.49 లక్షల 97వేల నగదు లభించింది. డబ్బులకు సంబంధించిన సరైన ఆధారాలు చూపక పోవడంతో రూ.49 లక్షల 97వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

## 16, 17న స్టైల్ పితార ఫ్యాషన్ ఎగ్జిబిషన్

మహిళలు ఇండ్లల్లో స్వయంగా తయారు చేసే వస్తువులతో..



స్టైల్ పితార ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రమారాఠి, వైశాలి ఇనాని, వినీతా బల్ద్వా, మీనల్ సార్దాలు

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 14: మహిళలు తాము ఇండ్లలో స్వయంగా తయారు చేసే వస్తువులతో స్టైల్ పితార ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్నట్లు క్రియేటిక్ ఆర్ట్స్ ప్రతినిధులు రమారాఠి, వైశాలి ఇనాని, వినీతా బల్ద్వా, మీనల్ సార్దాలు తెలిపారు. ఈ మేరకు కోఠిలోని హస్మత్‌గంజ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎగ్జిబిషన్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ నెల 16, 17వ తేదీలలో రెండు రోజుల పాటు రామ్‌కోఠిలోని కచ్చి భవన్‌లో క్రియేటివ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో స్టైల్ పితార ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. గృహిణులు స్వయం కృషితో తయారు చేసిన గృహోపకరణ, పరికరాలు, దుస్తువులు, ఇంటీరియర్ వస్తువులు, జ్యువెలరీ, ఫుట్‌వేర్ తదితర వస్తువులతో 100 స్టాళ్ళతో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి మహిళలు తమ ఉత్పత్తులతో స్టాళ్ళు ఏర్పాటు చేసుకో నున్నట్లు వారు వివరించారు. ఈ ఎగ్జిబిషన్‌లో వచ్చిన ఆదాయంలో కొంత భా గాన్ని ఏకలవ్య విద్యాలయ చారిటీకి తమ వంతు సహాయాన్ని అందించడం జరుగుతున్నదన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను భాగవతి మహేష్ బల్ద్వా, జయశ్రీ బాహెతీలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిస్తారని వారు వివరించారు. రెండు రోజుల పాటు కొనసాగే ఈ ఎగ్జిబిషన్ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని అన్నారు. గత 16 ఏండ్లుగా మహిళా సాధికారతలో భాగంగా మహిళలు, గృహిణులు స్వయంగా ఎదగాలనే ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

## యూటీఎస్ మొబైల్ యాప్‌తో తక్షణ టికెట్ బుకింగ్

బుకింగ్‌లలో 14.8 శాతం రికార్డును సాధించిన దక్షిణ మధ్య రైల్వే

సిటీబ్యూరో, అక్టోబర్ 14(నమస్తే తెలంగాణ): ప్రయాణికులు క్యూలో వేచి ఉండకుండా యూటీఎస్ మొబైల్ అప్లికేషన్ ద్వారా అన్ రిజర్వ్‌డ్ టికెట్ల కొనుగోలు సౌకర్యాన్ని దక్షిణ మధ్య రైల్వే అందిస్తున్నది. ఈ యాప్ ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2023–2024కు గాను టికెట్ బుకింగ్‌లలో 14.8 శాతం రికార్డును సాధించినట్లు శనివారం వెల్లడించారు. ఈ యాప్ ప్రారంభమైనప్పటి నుంచి రైలు ప్రయాణికుల నుంచి సానుకూల స్పందన పొందుతున్నది. దీంతో క్యూలైన్లలో నిలబడే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పినట్లేనని పేర్కొన్నారు. నాన్ సబ్–అర్బన్ స్టేషన్లకు 20 కిలోమీటర్ల పరిధిలో, సబ్–అర్బన్ స్టేషన్లకు 10 కిలోమీటర్ల దూరంలో టెక్కెట్లను కొనుగోలు చేయడానికి వీలును కల్పిస్తున్నది. ఈ యాప్ ద్వారా అన్ రిజర్వ్‌డ్ జర్నీ టికెట్లు, ప్లాట్ ఫామ్, సీజన్ టిక్కెట్లను కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పిస్తున్నది.

## గ్రేటర్@32.9 డిగ్రీలు..

జూబ్లీహిల్స్, అక్టోబర్ 14: కింది స్థాయి గాలులు తెలంగాణ వైపునకు వీస్తుండటంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 32.9 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 22.0 డిగ్రీల సెల్సియస్‌గా, గాలిలో తేమ 38 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. గాలిలో తేమ శాతం తగ్గడం, రాత్రి ఉష్ణోగ్రతలు పెరగడంతో ఉక్కపోత తప్పడం లేదు. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు.

## పాత వాహనాల విడి భాగాల అమ్మకానికి రేపు వేలం

జూబ్లీహిల్స్, అక్టోబర్ 14: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని ప్రభుత్వ కార్యాలయాలలో పాత వాహనాల విడి భాగాలను సోమవారం వేలం వేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు గచ్చిబౌలి ఎం.టి వద్ద వేలం ప్రక్రియ నిర్వహించబడుతుందని వెల్లడించారు. మరింత సమాచారం కోసం సైబరాబాద్ ఆర్ఐ ఎంటీఓ ఎన్.వీరలింగంను ఫోన్ నం: 94906 17317లో సంప్రదించాలని కోరారు.

## దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా.. ప్రమాదం

- ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టిన ఇన్నోవా
- ముగ్గురు మృతి, మరో నలుగురికి గాయాలు



మృతులు బైరి మారుతి, ఈదుకంటి బాల్‌రాజ్‌గౌడ్, లారీ డ్రైవర్ ప్రసాద్

శామీర్‌పేట, అక్టోబర్ 14: దైవ దర్శనం చేసుకుని తిరిగొస్తుండగా తీవ్ర రోడ్డు ప్రమాదం జరిగి, ముగ్గురు మృతి చెందగా మరో నలుగురికి గాయాల పాలయ్యారు. ఈ ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.., జీడిమెట్ల పైప్‌లైన్ రోడ్డుకు చెందిన బైరి మారుతి(31)తో పాటు చింతల్ బాపూనగర్‌కు చెందిన ఈదులకంటి బాల్‌రాజ్ గౌడ్(43), కుత్బుల్లాపూర్ మండలానికి చెందిన శ్రీనివాస్, సూరజ్, సురేశ్, వరుణ్‌లు ఇన్నోవా వాహనంలో తిరుపతికి వెళ్లి ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. ఔటర్ రింగ్‌రోడ్డు గుండా కీసర–శామీర్‌పేట రోడ్డులో వస్తున్నారు. అప్పటికే, అశోకా లేల్యాండ్ బడా దోస్త్ వాహనదారులు కొబ్బరి కాయల లోడుతో ప్రసాద్, మురళి సాయి, మహేశ్‌లు మేడ్చల్ వైపు వస్తున్నారు. ప్రమాదవశాత్తు ప్రసాద్ లారీ ఎడవైపు టైర్ పగిలిపోవడంతో ఓఆర్‌ఆర్‌పై పార్క్‌లైన్ వద్ద వాహనాలు నిలుపుకుని స్టెఫినీ వేస్తున్నారు. అదే సమయంలో తిరుపతి నుంచి మేడ్చల్ వైపు వస్తున్న ఇన్నోవా వాహనం డ్రైవర్ నిద్రమత్తులో ఉండి అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వాహనాన్ని ఓఆర్‌ఆర్ రెయిలింగ్‌కు తగిలించాడు. అప్రమత్తమై ఎరుదుగా రోడ్డుపై పార్క్‌లైన్ వద్ద ఆగి ఉన్న లారీని తప్పించబోయిన క్రమంలో రోడ్డుపై లారీ టైర్ స్టెఫినీ మార్చుతున్న ప్రసాద్‌ను ఢీకొడుతూ కొబ్బరికాయల లోడ్‌తో ఉన్న లారీని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ బైరి మారుతి, వెనుక సీటులో కూర్చున్న బాల్‌రాజ్ గౌడ్‌లు అక్కడికక్కడే మృత్యువాత పడగా, లారీ డ్రైవర్ అయిన ప్రసాద్‌కు తల, చేతులు, కాళ్లకు తీవ్రగాయాలు తగిలాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.



ఈ ప్రమాదంలో కారులో ఉన్న మరో నలుగురికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ సమాచారం అందుకున్న శామీర్‌పేట సీఐ నిరంజన్‌రెడ్డి ఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకుని పంచనామా నిర్వహించారు.

## మాటామాటా పెరిగి.. ఇద్దరి మధ్య ఘర్షణ

ఒకరిపై కత్తితో దాడి, మరొకరికి తీవ్రగాయాలు

బండ్లగూడ, అక్టోబర్ 14: ఎమ్మెల్సీ రహమత్ బేగ్ డ్రైవర్‌పై ఓ వ్యక్తి దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం, హసన్‌నగర్‌లోని ఇందిరానగర్‌లో ఉండే మహ్మద్ షహబాద్ ఖాన్ ఎమ్మెల్సీ రహమద్ బేగ్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి స్థానికుడైన తబ్రేజ్ షహబాద్ ఖాన్ ఇంటి ముందు కూర్చొని గంజాయి, మద్యం సేవిస్తున్నాడు. ఈ విషయమై షహబాద్ ఖాన్ తండ్రి అయూబ్ ఖాన్ ప్రశ్నించాడు. దీంతో తబ్రేజ్ అతడిని కొట్టాడు. ఇంట్లో ఉన్న షహబాద్ ఖాన్ బయటికి వచ్చి తబ్రేజ్‌ను నిలదీశాడు. కోపోద్రిక్తుడైన తబ్రేజ్ తన ఇంటికి వెళ్లి కత్తి తీసుకొని వచ్చి షహబాద్ ఖాన్‌పై దాడి చేసి పారిపోయాడు. తీవ్ర గాయాల పాలైన షహబాద్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకులు సమాచారంతో అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. అనంతరం, ఆస్పత్రిలో బాధితుడితో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.